

సాక్షి గుంటూరు

శనివారం । 21 । జనవరి । 2023



పశ్చిమకు 1416 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ కాలువకు శుక్రవారం 1416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిని వేర్వేరు కెనాల్స్ పంపిణీ చేశారు.



పులిచింతలలో 43 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతలలో ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 6709 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 వదులుతున్నారు.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ప్రతిభాపాటవాలు పెంచేందుకే పీఎంశ్రీ కార్యక్రమం

స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పార్వతి



నాదెండ్ల: విద్యలో మరింత శాస్త్రీయత, ఆధునికతను జోడించి విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెంపొందించేందుకు పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–శ్రీ) కార్యక్రమం అమలు చేస్తున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పి.పార్వతి చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీఎం–శ్రీ కార్యక్రమం అమలు కానున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిమిత్తం శుక్రవారం పాఠశాలను సందర్శించారు. స్కూలు, విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా రూ.27360 కోట్లతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐదేళ్ల పాటూ ఈ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, మరింత మెరుగైన వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అమలు చేయనున్నట్లు తెలిపారు. హెచ్ఎం పీవీఎంవీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తగా డెప్యూటీ కలెక్టర్ కేడర్‌లో ఉన్న జి.విజయలక్ష్మిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా శ్రీరాములు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా కందుల శ్రీరాములను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డెప్యూటీ కలెక్టరుగా ఉన్న శ్రీరాములు పదోన్నతిపై స్పెషల్ డెప్యూటీ కలెక్టరుగా నియమితులయ్యారు. అదే విధంగా పల్నాడు జిల్లా డిప్యూటీ కలెక్టరుగా ఉన్న కె.మాధురి బదిలీ అయ్యారు.

కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డి


గుంటూరు వెస్ట్: రాష్ట్రంలోని పలువురు డెప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డిని నియమించారు. ఇటీవల జిల్లా నుంచి పదోన్నతి పొందిన పెంచల ప్రభాకర్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. వాకా శ్రీనివాసులు రెడ్డిని విజయవాడ టూరిజం రీజనల్ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు.

యార్డులో 75,897 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): స్థానిక మిర్చియార్డుకు శుక్రవారం 70,514 మిర్చి బస్తాలు రాగా, గతనిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 75,897 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.28,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 35,141 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 572.40 అడుగుల వద్ద ఉంది. ఇది 262.5944 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,567, ఎడమకాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,778, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 28,543 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది. ఇది 70.6282 టీఎంసీలకు సమానం.



గుంటూరులోని ఏసీ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

45 పరీక్షా కేంద్రాలు.. 30,916 మంది అభ్యర్థులు

రేపు పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష

- కేంద్రాలను పరిశీలించిన గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్
- తరగతి గదులు, మౌలిక వసతులపై ఆరా
- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్త్, 144 సెక్షన్ అమలుకు ఆదేశాలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 22న జరగనున్న కానిస్టేబుల్ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పరీక్షా కేంద్రాలను విస్తృతంగా పరిశీలించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, వీవీఐటీ, ఏసీ కళాశాల, టీజేపీఎస్, మాజేటి గురవయ్య, బండ్లమూడి హనుమాయమ్మ, జీవీఆర్/ఎస్, బీఈడీ, కెరీర్ కళాశాలతోపాటు పలు కళాశాలలో కలియ తిరిగారు. ముందుగా తరగతి గదులను పరిశీలించారు. ఒక్కొక్క గదిలో ఎంత మంది అభ్యర్థులను అనుమతిస్తారు, బెంచీలపై హాల్ టిక్కెట్ల నంబర్లు, ఇన్విజిలేటర్లు, మౌలిక సౌకర్యాల ఏర్పాట్లపై ఆయా కళాశాలల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 22న ఉదయం ఎన్ని గంటలకు లోనికి అనుమతిస్తారనే విషయాలపై ఆరాతీశారు. ప్రతి ఒక్కరూ సమర్థంగా విధులు నిర్వర్తించాలని కళాశాలల యాజమాన్యం, అధ్యాపక సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30,916 అభ్యర్థులతో 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీ పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్ష జరగనుందని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. నిర్ణీత వేళకు ముందుగానే అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు 144 సెక్షన్ అమలవుతుందని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లను అనుమతించే ప్రసక్తి లేదని తెలియజేశారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, మొబైల్ దుకాణాలు మూసివేయించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అనిల్‌కుమార్, ఏఎన్‌యూ పరీక్షల చీఫ్ సమన్వయకర్త సిద్దయ్య, పలువురు చీఫ్ ఇన్విజిలేటర్స్, సూపరింటెండెంట్‌లు, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మీరానాయక్, సురేష్‌బాబు, ఎస్ఐలు ఉన్నారు.

నేడు వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి రాక
- ఏర్పాట్లు పూర్తి : డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: ప్లాటినం జూబ్లీ వేడుకలకు బాపట్ల వ్యవసాయ కళాశాల ముస్తాబైంది. ఆహ్వాన పత్రికలను కళాశాలల్లో డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాల డీన్ మాట్లాడుతూ శనివారం జరిగే ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 1200 మంది పూర్వవిద్యార్థులు పాల్గొంటున్నారని తెలి పారు. కళాశాల ప్రారంభించి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒక్కొక్క సంవత్సరానికి సంబంధించిన విద్యార్థితో కళాశాల ప్రాంతంలో ఒక కొబ్బరి మొక్కను నాటించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో తయారు చేసిన బీపీటీ 5204 వరి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక జ్ఞాపికను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 32రకాల వ్యవసాయ, ఫర్టిలైజర్, విత్తన, వ్యవసాయ యంత్రా పరికరాలతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యూనివర్సిటీ హెడ్ డాక్టర్ బి.విజయాభినందన, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు యామిని లీల, యామిని, స్నేహ, శేఖర్ పాల్గొన్నారు.

52 ఏళ్ల అపూర్వ కలయిక

- గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 1971 ఎంబీబీఎస్ బ్యాచ్ ఆనాటి ఆనంద క్షణాలు పంచుకున్న వైనం



వైద్య కళాశాలలో సంప్రదాయ వస్త్రాలు ధరించి గ్రూపు ఫొటో దిగిన నాటి వైద్య విద్యార్థులు, నేటి సీనియర్ వైద్యులు

గుంటూరు రూరల్: 52 సంవత్సరాల తరువాత కలిసిన ఆనాటి యువకులు నేడు మళ్లీ ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాము తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు, ఆనాడు అధ్యాపకుల చీవాట్లు, ఒకరికొకరు పంచుకున్న ఆప్యాయతానురాగాలు 52 సంవత్సరాల తరువాత కలిసి చెప్పుకుని ఆనాటి యువకులు నేటి వైద్యులు మురిసిపోయారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో 1971వ సంవత్సరంలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులు నేటి సీనియర్ వైద్యులు శుక్రవారం కలుసుకుని ఆత్మీయ అనురాగాలు కలిసి పంచుకున్నారు. ఐదు దశాబ్దాల క్రితం తాము చదువుకున్న తరగతి గదులు, ఆనాటి అధ్యాపకుల గురించి చెప్పుకుని ఆనంద క్షణాలను పంచుకున్నారు. ఒకరికొకరు పరిచయాలు చేసుకుని తమ ప్రస్తుత స్థితి గతులను గురించి చర్చించుకున్నారు. దేశ వ్యాప్తంగానే కాకుండా ఇతర దేశాల్లో వైద్యులుగా సేవలు అందిస్తున్న వారు 25 మందికి పైగా తమతోపాటు వైద్య విద్యనభ్యసించిన వైద్యులను కలుసుకునేందుకు గుంటూరు వైద్య కళాశాలకు విచ్చేసి సంబరాలు చేసుకున్నారు. నాడు చదివిన 135 మందిలో దాదాపు 90 మందికిపైగా హాజరయ్యారు. తమ బ్యాచ్‌లో అకాల మృత్యువుకు గురైన 20 మందికి నివాళులు అర్పించారు. తమ స్నేహితులను ఈవిధంగా ఒకే వేదికపై కలిసేందుకు కృషిచేసిన పూర్వ విద్యార్థులు నేటి వైద్యులు డాక్టర్ చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ జయరామ్, డాక్టర్ విఠల్, డాక్టర్ త్రిపురనేని రవికుమార్, డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావులను అభినందించారు.

గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్, సీనియర్ మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ ద్రోణంరాజు ఫణిభూషణ్, గుంటూరు వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్, సీనియర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అందె వెంకటేశ్వరరావు, జీజీహెచ్ మాజీ ఆర్ఎంఓ డాక్టర్ తమలపాకుల ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. మూడు రోజులపాటు వేడుకలు చేసుకునేందుకు హాజరైన సీనియర్ వైద్యులంతా గురువారం గుంటూరు జీజీహెచ్‌లోని పలు వైద్య విభాగాలను పరిశీలించి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య కళాశాల పూర్వ వైద్యులు కళాశాల అభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రస్తుతం వైద్య కళాశాలలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక స్థాయిలో సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ పీజీ సీట్లు వచ్చాయని, ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా కళాశాల అభివృద్ధికి రూ. 500 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. కళాశాలలో నూతనంగా పలు వైద్య విభాగాలను ప్రభుత్వం మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కళాశాల ప్లాటినం జూబ్లీ జరుగుతున్న తరుణంలో కళాశాలలో స్వర్ణోత్సవ యుగం నడుస్తుందని వెల్లడించారు.

నాడు–నేడుతో మహర్దశ

- వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఉర్దూ బాలుర పాఠశాలకు ఆధునిక హంగులు
- రెండో విడతలో సకల హంగులతో ఆధునికీకరణ
- రూ.68 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు



పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని ఉర్దూ బాయ్స్ స్కూల్‌కు వందేళ్ల ఘన చరిత్ర ఉంది. ఇంతటి ఐడికి ప్రభుత్వ పుణ్యమాని నాడు–నేడు కార్యక్రమంతో నేడు మహర్దశ కలిగింది. వందేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా నాడు–నేడు రెండో విడతలో అభివృద్ధికి పునాది పడింది. గుంటూరు నగర పరిధిలో అతిపెద్ద ఆటస్థలంతో పాటు విశాలమైన ప్రాంగణాన్ని కలిగిన పాఠశాల ఇదే కావడం విశేషం. రూ.68 లక్షల వ్యయంతో సకల హంగులతో ఆధునీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాఠశాల స్వరూపం సమూలంగా మారనుంది. నాడు–నేడు రెండో విడతలో గుంటూరు జిల్లాలో 563 పాఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం రూ.200 కోట్లతో ఆధునీకరించేందుకు అనుమతులు మంజూరు చేసింది.

వందేళ్లుగా..

స్వాతంత్య్రానికి పూర్వమే బ్రిటీషు కాలంలో నెలకొల్పిన ఈ పాఠశాల వందేళ్లకు పైగా నిరంతరాయంగా విద్యాభ్యాసం సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాల విద్యార్థులకు సకల వసతులతో ఆధునిక ఇంగ్లిష్ మీడియం చదువులను అందిస్తున్న ప్రభుత్వం నాడు–నేడు మొదటి దశలో పాఠశాలల స్వరూపాన్ని మార్చివేసి తనదైన ముద్ర వేసింది. గుంటూరు నగర పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలో మూడు పాఠశాలలు నడుస్తుండగా, చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న మహాకవి తిక్కన శ్రీపులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రూ.కోటి వ్యయంతో మొదటి దశలో ఆధునీకరించిన ప్రభుత్వం సకల వసతులను సమకూర్చింది. రెండో విడతలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను 10 కాంపానెంట్స్‌కు గాను ఏడు రకాల మౌలిక వసతులను కల్పించేందుకు రూ.68 లక్షలతో పనులు చేపట్టింది. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తరగతి గదుల్లో గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, విద్యుత్ బల్బుల ఏర్పాటు, బాల, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్ల నిర్మాణం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన ఫర్నీచర్, ఆర్వో వాటర్ ప్లాంటు వంటి సదుపాయాలను కల్పిస్తున్నారు.

ఏడు రకాల మౌలిక వసతులు

నాడు–నేడు రెండో విడతలో మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏడు కాంపొనెంట్స్ వారీగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారిగా పాఠశాలలో పూర్తిస్థాయిలో ఆధునికీకరణ పనులు చేపట్టడంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

–జి. సాల్మన్‌రాజు, హెచ్ఎం

రైతు కష్టానికి న్యాయమైన ప్రతిఫలం




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

వ్యవసాయ మండలి సమావేశంలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రైతులు పండించే ధాన్యంతోపాటు, ఇతర ఉత్పత్తులకు న్యాయమైన మద్దతు ధరకు విక్రయించుకునే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లాస్థాయి వ్యవసాయ మండలి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ధాన్యంతోపాటు, బీపీటీ రకం కూడా ఆర్బీకేల్లో మద్దతు ధరకు విక్రయించడం శుభ పరిణామమన్నారు. వారం నుంచి 15 రోజుల్లోపే నగదు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిచిపోయిందని, కొందరు దళారులు మోసం చేసే అవకాశం ఉందని, దీనిని అధికారులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యానికి చక్కని మద్దతు ధర ప్రకటించారని, ఇది రైతులకు మేలు చేస్తుందని చెప్పారు. ధాన్యం నిర్దేశిత తేమ 17 శాతం ఉన్న 75 కేజీల బ్యాగ్‌ను రూ.1545లకు కొనుగోలు చేస్తామని, అదనంగా ఉన్న తేమ ప్రతి ఒక్క శాతానికి కేజీ తరుగుతు తీసి కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1238 మంది రైతుల వద్ద నుంచి 1100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.14.79 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. చిరు ధాన్యాల సాగుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దీనిని పెంచే మార్గాలను అధికారులు పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాలలు, మధ్యాహ్న భోజనాల్లో చిరు ధాన్యాలతో కూడిన ఆహార ధాన్యాలు అందించాలన్నారు. రబీ పంటల సాగుకు రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాలు అందించే ఏర్పాటు చేయాలన్నారు. రబీకి అవసరమైన అన్నిరకాల ఎరువులు సరఫరా అయ్యే విధంగా మార్క్‌ఫెడ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, సూపర్‌ఫాస్ఫేట్, అమోనియం, సల్ఫేట్ ఎరువులు 25,940 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, మరో 20,758 మెట్రిక్ టన్నుల ఎరువులు రావల్సి ఉందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.7 కోట్లు అందించామని చెప్పారు. ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పంటలను పరిశీలిస్తూ రైతులకు కావల్సిన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుజాత, ఏపీఎంఐపీ అధికారి వజ్రశ్రీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గొట్టిముక్కల శ్రీజ పాల్గొన్నారు.

పదవీ విరమణపై నాలుగు రోజుల్లో జీవో

- రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి
- లాంలో ఏపీ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల రాష్ట్ర సంఘం సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి

గుంటూరు రూరల్: ఉద్యోగ విరమణ వయస్సును విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి 62 సంవత్సరాలకు పెంచుతూ జీవోను మరో నాలుగైదు రోజుల్లో ప్రభుత్వం విడుదల చేయనుందని ఏపీ ఎస్‌సీహెచ్ఈ చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం గుంటూరు శివారు లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సును నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, తదితర జీవోలు సకాలంలో విడుదల అయ్యే టట్టు, విశ్వవిద్యాలయాల బడ్జెట్ సక్రమంగా వచ్చేటట్లు రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రగతిని బోధనేతర సిబ్బంది కృషిని కొనియాడారు. మరింత శ్రమించి విశ్వవిద్యాలయం ఉన్నతికి కృషిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ డాక్టర్ పి.గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

సంస్కృతి ప్రతిబింబించాలి



- సృజనాత్మకత లేకపోతే ప్రగతి లేదు
- ఏపీ చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత
- ఘనంగా ఏఎన్‌యూలో ఎన్ఐడీ ప్రథమ స్నాతకోత్సవం

ఏఎన్‌యూ: సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళను పెంపొందించుకోవాలని ఎన్ఐడీ విద్యార్థులకు ఏపీ చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కేంద్రంగా కొనసాగుతున్న ఎన్ఐడీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్) మొదటి స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సునీత ప్రసంగిస్తూ ఇతర రంగాలకంటే డిజైనింగ్ రంగం ఎంతో భిన్నమైనదన్నారు. డిజైనింగ్ కోర్సు చదివిన విద్యార్థులకు విద్యతో పాటు సృజనాత్మకత, నైపుణ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. డిగ్రీ పట్టాతోపాటు సంప్రదాయక కళను కూడా పెంపొందించుకోవాలన్నారు. వంద డిజైన్లు గీస్తే అవి అన్నీ ఖ్యాతి పొందకపోయినా వాటి నుంచి మీరు ఎంతో నేర్చుకోవచ్చని తెలిపారు. మన దేశంలో పలు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కొండపల్లి వంటి హస్తకళలకు ఏపీలో ఎంతో ఆదరణ ఉందన్నారు. కళలు, సృజనాత్మకత ద్వారా సంస్కృతిని పెంపొందించే మహత్తరమైన అవకాశం ఎన్ఐడీ విద్యార్థులకు నిపుణులకు ఉంటుందన్నారు. సృజనాత్మకత లేకపోతే ఏ రంగంలోనూ ప్రగతి ఉండదన్నారు. ఏపీ హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖకు, ఎన్ఐడీకి ఎంఓయూ ఉందని దానిలో భాగంగా హస్తకళలకు ఎన్ఐడీ విద్యార్థులు చేసిన డిజైన్లు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎన్ఐడీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేఖర్ ముఖర్జీ సంస్థ నివేదికను సమర్పించారు. ఎన్ఐడీ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆర్కే సింగ్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యన్నారాయణ ప్రసంగించారు. బ్యాచులర్ ఆఫ్ డిజైన్ కోర్సు పూర్తి చేసిన 49 మంది విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేశారు. ఎన్ఐడీ విద్యార్థులు తయారు చేసిన పలు డిజైన్లు ప్రదర్శించారు. ఎన్ఐడీ డిప్యూటీ రిజిస్ట్రార్ పీయూష్ శర్మ, అకడమిక్ కోఆర్డినేటర్ భూమయ్య, స్నాతకోత్సవ కోఆర్డినేటర్ అర్పబ్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో నిందితుడు ఆత్మహత్య

బల్లికురవ: మండలంలోని వేమవరం గ్రామంలో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడు గొట్టిపాటి వీరాంజనేయులు (36) శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలోకి వెళితే.. 2017 మే నెలలో గ్రామానికి చెందిన గోరంట్ల అంజయ్య, వేగినాటి రామకోటేశ్వరరావుల హత్య కేసులో వీరాంజనేయులు నిందితుడు. కోర్టు వాయిదాలకు తిరుగుతూ చిలకలూరిపేటలో మకాం ఉంటూ అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. శుక్రవారం కోర్టు కేసు వాయిదాకు ఒంగోలు వెళ్లి తిరిగి వచ్చి జీవితంపై విరక్తితో చిలకలూరిపేటలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరాంజనేయులు భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

రేపు సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ అధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

9703013015, 9912671555

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మద్యం విక్రయిస్తున్న టీడీపీ నాయకుడు

- ఇంట్లో పట్టుబడ్డ గోవా మద్యం, నాటు సారా
- తనిఖీలకు వెళ్లిన సెబ్ సిబ్బందిపై దాడి
- ఎస్‌ఐ తులసీకి గాయాలు
- నిందితుడి పరార్

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులపై శుక్రవారం టీడీపీ నాయకులు దాడికి పాల్పడి నిందితుడిని తప్పించారు. పమిడిపాడులో టీడీపీ నాయకుడు బండ్ల హరికృష్ణ నిబంధనలకు విరుద్ధంగా మద్యం, నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్నాడన్నా సమాచారం సెబ్ ఉన్నతాధికారులకు అందింది. దీంతో నరసరావుపేట ఎస్‌ఐ సురేంద్రబాబు, సత్తెనపల్లి ఎస్‌ఐ తులసి ఆధ్వర్యంలో సిబ్బంది పమిడిపాడు గ్రామానికి వెళ్లి హరికృష్ణ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. గోవా రాష్ట్రానికి చెందిన 11 మద్యం బాటిళ్లు, ఐదు లీటర్ల నాటు సారా గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడు హరికృష్ణను అదుపులోకి తీసుకొన్నారు. స్టేషన్‌కు తరలిస్తుండగా హరికృష్ణ కుటుంబ సభ్యులు, గ్రామంలోని టీడీపీ నాయకులు పోలీసులను అడ్డగించారు. ఎస్‌ఐ తులసీపై దాడికి పాల్పడటంతో చేతికి గాయమైంది. దీంతో పాటు రాళ్లు రువ్వటంతో సిబ్బంది నాగరాజు గాయపడ్డాడు. ఈ క్రమంలో పోలీసుల అదుపులో ఉన్న హరికృష్ణ విడిపించుకొని పారిపోయాడు. అతడు ఇప్పటికే మూడు అక్రమ మద్యం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గ్రామంలోని టీడీపీ నాయకుడు పారా నానీతో కలసి గత కొంత కాలంగా హరికృష్ణ అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దాడికి పాల్పడ్డ వారిలో ఐదుగురిని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం, నాటుసారాతో పాటు పోలీసు విధులకు ఆటంకం కలిగించిన నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

శ్రమజీవుల సంక్షేమమే సంపద సృష్టికి మూలం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: శ్రమజీవుల సంక్షేమమే సంపద సృష్టికి మూలమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు మిర్చి యార్డులో ఇప్పటి వరకు రెండు యూనియన్లుగా ఉన్న వే మెన్లు తాజాగా ఒక్క తాటి పైకి వచ్చి శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల విలువ తెలిసిన వ్యక్తిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కార్మికవర్గ దృక్పథంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్మికులు విడిపోయి అసంఘటితంగా ఉంటే హక్కులు కాపాడుకోలేమని, తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణకు ఎప్పుడూ ఐకమత్యంగానే ఉండాలని సూచించారు. ప్రతిష్ఠాత్మకమైన మిర్చి యార్డులో రెండు యూనియన్లు కలిసిపోవడం శుభపరిణామమని తెలిపారు. మిర్చి యార్డు కార్మికులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం తరపున తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మిర్చి యార్డులోని పలు సంఘాల నేతలు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, సాంబిరెడ్డి, దాది నరేంద్ర, తుమ్మలపల్లి రామారావు, కె. మార్క్ శ్రీనివాసరెడ్డి, పాదిలి శ్రీనివాసరావు, వే మెన్ ట్రేడ్ యూనియన్ నేతలు శ్రీనివాసరెడ్డి, శ్రీహరి, సీతారామిరెడ్డి, రాజగోపాల్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

- ఫేక్ సర్టిఫికెట్లతో బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందే యత్నం
- విచారణలో తేలడంతో తుళ్లూరు స్టేషన్‌లో ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తాడికొండ: హైకోర్టు బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందేందుకు ఫేక్ డాక్యుమెంట్లతో ప్రాక్టీస్ చేస్తున్న ముగ్గురు న్యాయవాదులపై బార్ కౌన్సిల్ కార్యదర్శి పి.పద్మలత ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన వివరాల ప్రకారం... బిక్కి నాగేశ్వరరావు, మాచర్ల వెంకటేశ్వరరావు, పొత్తూరి శ్రీనివాసవరప్రసాద్ అనే ముగ్గురు బిహార్‌కు చెందిన మగదా యూనివర్సిటీ చెందిన ఫేక్ డాక్యుమెంట్లు బార్ కౌన్సిల్‌లో సమర్పించి సభ్యత్వం కోసం ప్రాక్టీస్ చేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన నిమిత్తం మగదా యూనివర్సిటీకి పంపగా, ఫేక్ డాక్యుమెంట్లుగా నిర్ధారణ కావడంతో బార్ కౌన్సిల్ కార్యదర్శి పి.పద్మలత ఈనెల 11న తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. సత్తెనపల్లి, కాకినాడ ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు తెలిసింది.

పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఖజానా శాఖ డీడీ రాజగోపాల్

గుంటూరు వెస్ట్: ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ డైరీని ఖజానా శాఖ డీడీ బి.రాజగోపాల్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాగరాజు మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్ల విషయంలో ట్రెజరీ శాఖ సాయం గొప్పదని ప్రశంసించారు. అనారోగ్యంతో మంచాన ఉన్న ఉద్యోగులకు ఇంటికే తీసుకెళ్లి పెన్షన్ అందించే విధంగా సహకరించాలని కోరారు. ఈకేవైసీ చేసుకోకపోయినా పెన్షన్ ఆగదని డీడీ చెప్పిన మాటలకు తమకు ఎంతో ధైర్యాన్నిచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.శ్రీనివాసరావు, జె.సాంబశివరావు, ఎం.ఎస్.నాగేంద్రరావు, మస్తాన్ సుబ్బారావు, సాయిబాబు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల ఆందోళన



నినాదాలు చేస్తున్న వివిధ బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు

కొరిటిపాడు(గుంటూరు): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీటీ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీసు వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, బ్యాంకుల యాజమాన్యాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకుడు సయ్యద్ బాషా మాట్లాడుతూ ఐదు రోజుల పని విధానాన్ని చేపట్టాలని, పాత పెన్షన్, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. బ్యాంకులలోని అన్ని విభాగలలో తక్షణమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. వచ్చే నవంబర్ 1వ తేదీ నుంచి జరగనున్న వేతన సవరణపై వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకుడు జయకుమార్ మాట్లాడుతూ ఈ నెల 30, 31వ తేదీలలో సమ్మెకు బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు బాషా, కిశోర్‌కుమార్, వేణు, రవిచంద్రారెడ్డి, మురళి, చంద్రశేఖరరెడ్డి, షరీఫ్, నాగేందర్, విజయక్రాంతి, పావని, శివ, ప్రభుకిషోర్, ప్రేమకుమార్, కోటిరెడ్డి, బాలగోపాల్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న రైతు సమస్యలపై చలో ఢిల్లీ



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

పాత గుంటూరు: రైతు సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని రైతు సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షతన రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే కార్యక్రమం నిలిపివేయాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేసి ప్రతి ఒక్క రైతుకు బీమా పరిహారం అందించాలని కోరుతూ ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, రైతు సంఘం ఉపాధ్యక్షులు పాశం రామారావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు, ఎం.శివ సాంబి రెడ్డి, కొత్త వెంకటశివరావు, ఎం.వెంగళరెడ్డి, కె.పూర్ణచంద్రరావు, వల్లూరి భారతి, నక్కా నాగ పార్వతి, టీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అధ్యాపకులకు అరుదైన ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి కె. మధుబాబు, సోషల్ వర్క్ విభాగ అధ్యాపకురాలు సరస్వతీరాజు అయ్యర్‌కు అరుదైన ఆహ్వానం అందింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో కొనసాగే బెస్ట్ డిప్లమాట్స్ సంస్థ నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వీరిద్దరికి ఆహ్వానం అందింది. పేదరికం సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం అనే అంశంపై మధుబాబు, దేశంలో లింగ వివక్షపై సరస్వతీరాజు అయ్యర్ రాసిన వర్కింగ్ పేపర్స్‌ను ఆమోదించిన ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ వీరిద్దరికీ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం పంపింది. ఈ ఏడాది 19 నుంచి 22వ వరకు దుబాయ్‌లో ఈ సదస్సు జరగనుంది.

విజ్ఞాన్ లారా విద్యార్థులకు మూడు బంగారు పతకాలు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల ఇద్దరు విద్యార్థులకు మూడు బంగారు పతకాలు లభించాయి. ఇటీవల జేఎన్‌టీయూ కాకినాడ విడుదల చేసిన 2018-22 బ్యాచ్ ఇంజనీరింగ్ ఫలితాల్లో మెకానికల్ విభాగానికి చెందిన గొంటు యశ్వంత్ రెడ్డి 9.17 సీజీపీఏతో టాపర్స్ విభాగంలో గోల్డ్ మెడల్, ప్రొఫెసర్ అల్లం అప్పారావు బంగారు పతకాలు సాధించాడని ప్రిన్సిపాల్ కేపీ కుమార్ శుక్రవారం తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో దేవరపాటి రాజ్యలక్ష్మి 9.12 సీజీపీఏతో బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. త్వరలో నిర్వహించబోయే తొమ్మిదో స్నాతకోత్సవంలో విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌ను అందుకోనున్నారని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక





ఎంపికైన బాలబాలికల జట్లు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 150 మంది బాలురు, 60 మంది బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వి.వీర్లంకయ్య, రిఫరీ బోర్డు చైర్మన్ పి.కృష్ణమూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజశేఖరరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.కృష్ణంరాజు పోటీలను పర్యవేక్షించగా, సెలక్షన్ కమిటీ సభ్యులుగా కె.తిరుపతిరావు, ఆర్.ఆంజనేయులు, కె.సత్యనారాయణ, ఎస్.గురుస్వామి, సురేంద్ర వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి అనకాపల్లిలో జరగనున్న 70వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీర్లంకయ్య తెలిపారు.

బాలుర జట్టు

బి.విజయకుమార్, వై.నజీర్, ఓ.శ్రీహరి, ఏ.సురేష్, షేక్.బాజీ, జి.సైదా, సిహెచ్.లక్ష్మీనారాయణ, పి.గణేష్‌రెడ్డి, జి.శివశ్రీను, జే.అశోక్, పి.శ్యాంసన్, సిహెచ్.వసంతకుమార్, జె.అవినాష్.

బాలికల జట్టు

షేక్.ఫర్హానా, ఏ.మహిత, ఆర్.వాణికోటేశ్వరమ్మ, వి.సంధ్యాబాయి, జి.నందిని, ఎం.కావేరి, వై.అనూరాధ, పి.వైష్ణవి, బి.సౌజన్య, డి.హేమలత, ఎం.శిరీష, ఎం.సాత్విక.

టీబీ నివారణకు కృషి చేద్దాం

టీబీ అండ్ లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ పద్మావతి

నరసరావుపేట: జిల్లాలో టీబీ నివారణకు ప్రైవేటు పల్మనాలజిస్టు విభాగ డాక్టర్లు, కెమిస్టు అండ్ డ్రగ్గిస్టులు సహకరించాలని టీబీ అండ్ లెప్రసీ జిల్లా పర్యవేక్షణాధికారి అధికారి డాక్టర్ కె.పద్మావతి కోరారు. 2025 నాటికి దేశంలో టీబీ లేకుండా చేయాలనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యాన్ని నెరవేర్చేదుకు అందరూ సహకరించాలన్నారు. గత నెల నుంచి టీబీపై సర్వే చేస్తున్న నేపథ్యంలో సబ్‌నేషనల్ సర్టిఫికేషన్ సర్వే డాక్టర్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధి, ప్రొఫెసర్ డాక్టర్ విజయకృష్ణ జిల్లాలోని అధికారులు, ప్రైవేటు పల్మనాలజిస్టులు, డ్రగ్స్ అండ్ కెమిస్టు అధికారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ ఆరోగ్యకార్యాలయంలో జరిగిన ఈ సదస్సును డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, టీబీ నివారణాధికారి డాక్టర్ పద్మావతి పర్యవేక్షించారు. డాక్టర్ విజయకృష్ణ గత ఐదేళ్లకాలంలో టీబీ కేసుల నివేదికలను పరిశీలించారు. కెమిస్టు అండ్ డ్రగ్గిస్టులు అధికారుల ఆదేశాల మేరకు మందులు విక్రయిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేయడంలో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వెల్లడించారు.

‘వర్సిటీ’ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి 12 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ ఎస్.శేఖర్, ప్రొవిడెన్స్ గ్లోబల్ సీనియర్ మేనేజర్ గడిపూడి రంగవల్లి, చిలకలూరిపేట నిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ ఓలేటి శిరీష, ఎంఏఎం ఫార్మసీ కళాశాల కార్యదర్శి ఎంఆర్ శేషగిరిరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి దోహదచేస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనే విధంగా కళాశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని సూచించారు. మొదటి రోజు పోటీల్లో తెనాలి జేఎంజే మహిళా కళాశాల, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, ఎంఏఎం ఫార్మసీ కళాశాల, ధనలక్ష్మీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్లు పాల్గొన్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా జీపీ ఎంఆర్ నీలాకుమారి, డాక్టర్ సిహెచ్.వెంకట్రావు, కె.అరుణ సుజాత వ్యవహరించారు. శనివారం ఫైనల్స్ నిర్వహించనున్నారు.